క్లుప్తంగా

పేదింటి మహిళకు చేయూత

కర్నూలు(అగ్రికల్చర్): మన కోసం మనం అనే స్వచ్ఛంద సంస్థ వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతుండటం అభినందనీయమని ఏపీ ఆల్ మేవ జిల్లా శాఖ అధ్యక్షుడు అబ్దుల్‌హమీద్ అన్నారు. మంగళవారం సామాజిక సభ్యుల సహకారంతో పేదింటి మహిళ వివాహానికి బియ్యం, ఇతర కిరాణం సరుకులు, కొంత నగదును స్వచ్ఛంద సంస్థ తరుపున అందచేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అబ్దుల్ సలీమ్, విశ్రాంత తహసీల్దార్లు రోషన్‌అలీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చదువుకునే వాతావరణాన్ని కల్పించాలి



విద్యార్థి ఇంటికి వెళ్లి చదువుపై ఆరా తీస్తున్న డీఈఓ రంగారెడ్డి

కర్నూలు(సిటీ): ఇంట్లో పిల్లలకు చదువుకునే వాతావరణాన్ని కల్పించాలని డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి తల్లిదండ్రులకు సూచించారు. పదో తరగతి ఫలితాలను పెంచేందుకు విద్యాశాఖ చేపట్టిన నైట్ విజిట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన కర్నూలు మండలం గార్గేయపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. గార్గేయపురంతో పాటు కేతవరం గ్రామాల్లో పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని క్రమం తప్పకుండా స్కూల్‌కు పంపించాలన్నారు. అంతేగాక ఇంట్లో పిల్లలు చదువుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వంద శాతం ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నేడు తనిష్క్ షోరూం ప్రారంభం



మాట్లాడుతున్న టైటాన్ కంపెనీ రీజినల్ హెడ్ శరత్

కర్నూలు (టౌన్): దేశంలో అతిపెద్ద ఆభరణాల వాణిజ్య బ్రాండ్ టాటా గ్రూపునకు చెందిన తనిష్క్ జ్యువెలరీ సేవలను వినియోగించుకోవాలని టైటాన్ కంపెనీ రీజినల్ హెడ్ శరత్ అన్నారు. నగరంలోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని మేడం కాంపౌండ్‌లో తనిష్క్ షోరూంను బుధవారం ఉదయం లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం సాయంత్రం తనిష్క్ షోరూంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనిష్క్ షోరూం ప్రారంభం పురస్కరించుకొని వినియోగదారుల కోసం ప్రతి కొనుగోలుకు ఉచితంగా బంగారు నాణెం అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో టైటాన్ కంపెనీ మేనేజర్ శ్రీకృష్ణ, సస్య గ్రూపు అధినేతలు శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, కృష్ణమోహన్, సస్య పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ కేఎల్‌ఆర్‌కే కుమారి

కర్నూలు(రాజ్‌విహార్): బాల్యవివాహాలను నివారించేందుకు తగిన దృష్టి సారించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి కె.ఎల్.ఆర్.కె. కుమారి సూచించారు. మంగళవారం సాయంత్రం ఆమె కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో సీడీపీఓలతో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయని, వీటి పట్ల ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పనులను వేగవంతం చేసి పూర్తి చేయించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో సీడీపీఓలు అనురాధ, వరలక్ష్మి దేవి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్, వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, మైఖేల్, వారసుడు, అమిగోస్, టైటానిక్, రైటర్ పద్మభూషణ్, నువ్వొస్తానంటే నేనొద్దంటానా
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: వీర సింహారెడ్డి, వారసుడు, అమిగోస్, వసంత కోకిల, రైటర్ పద్మభూషణ్, నువ్వొస్తానంటే నేనొద్దంటానా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: వాల్తేరు వీరయ్య, అమిగోస్
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, పఠాన్, రైటర్ పద్మభూషణ్, టైటానిక్, నువ్వొస్తానంటే నేనొద్దంటానా
భరత్ కాంప్లెక్స్ : పఠాన్, వేదా, వారసుడు
రాజ్: పాప్ కార్న్
శ్రీరామ : ధమాకా
విజయ: వేదా

మౌలిక సదుపాయాలు కల్పించండి

- ట్రిపుల్‌ఐటీ డీఎంకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోండి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.కోటేశ్వరరావు





ట్రిపుల్‌ఐటీ డీఎంకు మౌలిక సదుపాయాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు/హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): జగన్నాథగట్టులోని ట్రిపుల్‌ఐటీ డీఎం భవన సముదాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలను త్వరితగతిన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్(ఐఐఐటీ డీఎం)కు అవసరమైన మౌలిక సదుపాయాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రిపుల్ ఐటీ డీఎంకు సంబంధించిన మౌలిక సదుపాయాల్లో భాగంగా ఎన్‌హెచ్40 నుంచి యూనివర్సిటీ వరకు అవసరమైన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం టెండర్లను పిలవాలని పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యంను ఆదేశించారు. యూనివర్సిటీ కోసం అవసరమైన 2 ఎల్ఎండీ ట్యాంకు తాగునీటి సదుపాయం కోసం ప్రతిపాదలను తయారు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. హైలెవల్ విద్యుత్ లైన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈ ఉమాపతిని ఆదేశించారు. రోడ్డు విస్తరణ, వీధి దీపాలు, కళాశాల ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సంబంధిత అధికారులు రూపొందించిన ప్రణాళికల నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, నగర పాలకసంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొన్నారు.

సచివాలయాల వద్ద శుభ్రత.. సిబ్బంది బాధ్యత

కర్నూలు (టౌన్): సచివాలయాల వద్ద శుభ్రత సచివాలయాల సిబ్బంది బాధ్యత అని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక నగరపాలక పరిధిలోని జొహరాపురం వద్ద ఉన్న 40, 41 సచివాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లో హాజరు పట్టిక, ఉద్యోగుల మూవ్‌మెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడ్యుకేషన్ కార్యదర్శి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తప్పని సరిగా పరిశీలించాలన్నారు. అలాగే స్కూల్‌డ్రాప్ ఔట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో సచివాలయాల పరిధిలో చిన్నారులకు రక్త హీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

వేలాలకు మంచి స్పందన

- నగరపాలక రెవెన్యూ విభాగానికి రూ.14.43 లక్షల ఆదాయం

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలోని మార్కెట్లు, సైకిల్ స్టాండ్లకు మంగళవారం స్థానిక కౌన్సిల్ హాలులో బహిరంగ వేలాలు నిర్వహించారు. వేలాల్లో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, రెవెన్యూ అధికారి జునీద్ పాల్గొన్నారు. పాత బస్టాండ్ కింగ్ మార్కెట్‌ను ఖందేరికి చెందిన జి.మహమ్మద్ ఖజీమ్ హుస్సేన్ అనే పాటదారుడు రూ.5 లక్షల 85 వేలకు, ఫిష్‌మార్కెట్‌ను కె.ప్రదీప్ రూ.1లక్షకు, నగరపాలక కార్యాలయంలోని సైకిల్ స్టాండ్‌ను బుధవారపేటకు చెందిన బంగి పద్మావతి రూ.90 వేలకు, కిడ్స్ వరల్డ్ సైకిల్ స్టాండ్ కోసం వై.రామ్‌చరణ్ రూ.3 లక్షల 50 వేలకు, షరాఫ్‌బజార్ సైకిల్ స్టాండ్‌ను కూడా వై.రామ్‌చరణ్ రూ. 3 లక్షల 80 వేలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది మార్కెట్ వేలాల ద్వారా నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగానికి రూ.14.43 లక్షల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, రాజు, సోహెయిల్, ఇస్మాయిల్, వాజిద్ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్ల నిర్వహణలో అశ్రద్ధ చూపొద్దు

కర్నూలు (అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల వసతి గృహాల నిర్వహణలో ఎలాంటి అశ్రద్ధ చూపకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజన వసతులు కల్పించాలని జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి ఎ.నాగేశ్వరరావు కోరారు. అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయనను మంగళవారం సాయంత్రం బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పాలేగార్ సత్యనారాయణ రాజు, అధ్యక్షులు పి.శ్రీనివాసులు తదితరులు కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని వసతి గృహాల్లో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా అన్ని హాస్టళ్లలో వంద శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు ఎం.శ్రీనివాసులు, విశ్వనాథ్‌రెడ్డి, మహాలక్ష్మి, గిరిజారెడ్డి తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు (టౌన్): పారిశుద్ధ్య నిర్వహణ పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని నగరపాలక డిప్యూటీ కమిషనర్ రమాదేవి అన్నారు. మంగళవారం నగర పాలక సంస్థ పరిధిలోని 12వ శానిటేషన్ డివిజన్‌లో అమె పారిశుద్ధ్యంపై తనిఖీలు నిర్వహించారు. కృష్ణానగర్, న్యూకృష్ణానగర్, ఆదిత్య నగర్ తదితర కాలనీలలో పర్యటించి స్థానిక మహిళలతో ఆరా తీశారు. శానిటేషన్ సిబ్బంది ప్రతి రోజు వస్తున్నారా.. మురుగు కాల్వలు శుభ్రం చేస్తున్నారా... అంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు నగరంలోని శానిటేషన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు ఉన్నారు.

విద్యుత్ ప్రత్యేక అధికారుల నియామకం

కర్నూలు(రాజ్‌విహార్): మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీశైలంలో జరిగే బ్రహ్మోత్సవాల నేపథ్యంలో విద్యుత్ శాఖ ప్రత్యేక అధికారులను నియమించింది. విద్యుత్ సరఫరా, అంతరాయం నివారణ, బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్, ఫ్యూజ్ ఆఫ్ కాల్, లో ఓల్టేజీ వంటి సమస్యలను నివారించడంతో పాటు సమస్యలు, ఫిర్యాదులపై స్పందించి పరిష్కరించేందుకు ప్రత్యేక అధికారులు పని చేయనున్నారు. ఓవరాల్ ఇన్‌చార్జిగా కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏ. శ్రీనివాస బాబు, ఆత్మకూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఆర్ భగవాన్ దాస్, బ్రేక్ డౌన్ బ్యాచ్‌లో శ్రీశైలం ఏఈ ఎన్.సత్యనారాయణతో పాటు ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఏడుగురు ఓ అండ్ ఎం సిబ్బంది. కంట్రోల్ రూం ఇన్‌చార్జ్‌గా ఏడీఈ జి.సురేష్‌కుమార్, మరో ఇద్దరు, లోడ్ మానిటరింగ్‌లో ఏఈలు రాజేంద్రబాబు, జి.శ్రీనివాసరెడ్డి, జోన్-1 ఇన్‌చార్జ్‌గా ఏడీఈ మోహన్ కుమార్, జోన్-2 ఇన్‌చార్జ్‌గా కర్నూలు ఏడీఈ పి.రాజమోహన్‌రెడ్డి, జోన్-3 ఇన్‌చార్జ్‌గా కన్‌స్ట్రక్షన్స్ ఏడీఈ బి.రంగస్వామి, సున్నిపెంట సబ్‌స్టేషన్ ఇన్‌చార్జ్ ఎ.మక్బూల్ బాషాతో పాటు మొత్తం 56 మంది సిబ్బందిని నియమించారు. ఈ మేరకు కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా ఈనెల 16వ తేదీన ఉదయం సంబంధిత కంట్రోలింగ్ ఆఫీసర్ల వద్ద రిపోర్టు చేసుకోవాలని, 19వ తేదీ వరకు విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

19న 'యే షామ్ ఆప్ కే నామ్'

కర్నూలు కల్చరల్: ఆర్‌ఆర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు వివేకానంద సర్కిల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో యే షామ్ ఆప్ కే నామ్ పేరుతో సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, గాయని రాణి తెలిపారు.

మెరుగైన సేవలందించాలి

కర్నూలు(హాస్పిటల్): ఫ్యామిలి ఫిజీషియన్ విధానంలో గ్రామీణ ప్రజల ఆరోగ్యస్థితిగతులను తెలుసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. మంగళవారం ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో సామాజిక ఆరోగ్య అధికారుల మూడవ విడత శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీహెచ్‌వోలు ఈ శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకుని గ్రామస్థాయిలో మెరుగైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంయూ డాక్టర్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఎండోక్రైనాలజీ హెచ్‌ఓడీగా డాక్టర్ శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎండోక్రైనాలజీ విభాగం హెచ్‌ఓడీగా డాక్టర్ పి.శ్రీనివాసులు నియమితులయ్యారు. విశాఖపట్నం ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఆయన కర్నూలుకు బదిలీ అయ్యారు. ఇక్కడ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ జె.ఎ.వి.సుబ్రహ్మణ్యం వైజాగ్‌కు బదిలీ అయ్యారు. ఈయనతో పాటు న్యూరోసర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రహ్లాద గుంటూరు ప్రభుత్వాసుపత్రికి బదిలీ అయ్యారు.

విద్యుత్ కనెక్షన్ల వేగం పెంచండి

కర్నూలు(రాజ్‌విహార్): జగనన్న కాలనీల్లో ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ ఓఎస్‌డీ (విజయవాడ) శ్రీనివాసులు అన్నారు. మంగళవారం రాత్రి ఆయన విద్యుత్ భవన్‌లో ఇక్కడి అధికారులతో సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీలకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, స్తంభాలను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి, ఈఈలు రమేష్, శ్రీనివాస బాబు, రాజేష్, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

'పోలీసుల దాడి హేయం'

కర్నూలు(సెంట్రల్): కృష్ణా జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి పవన్‌పై పోలీసులు దాడి చేసి దుస్తులు ఊడదీసి విచక్షణారహితంగా కొట్టడం హేయమైన చర్య అని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ అన్నారు. ఈ సంఘటనను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు.

ఫేస్ యాప్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వీఆర్‌ఏలకు ఫేస్ యాప్ నుంచి మినహాయింపు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు కలెక్టరటే ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు.

సైక్లింగ్‌తో ప్రాణాంతక క్యాన్సర్ నివారణ



సైకిల్ ర్యాలీల్లో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య, ఇతర అధికారులు

కర్నూలు(హాస్పిటల్): రోజూ సైకిల్ తొక్కడం వల్ల ప్రాణాంతక క్యాన్సర్‌ను నివారించుకోవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ మేళా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎ.క్యాంపులోని మెరీడియన్ ఫంక్షన్ హాలు వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద సైక్లోథాన్(సైకిల్ ర్యాలీ)ని డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్-అందరికీ ఆరోగ్యం అన్న నినాదంతో డిసెంబర్ నుంచి ప్రతి నెలా 14వ తేదీన హెల్త్‌మేళాలను జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్యకేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో హెల్త్ క్యాంపు, యోగా శిక్షణ, టెలిమెడిసిన్ సేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, క్యాన్సర్, అసంక్రమిత వ్యాధుల చికిత్సలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల కలిగే లాభాలను జిల్లా వ్యాప్తంగా ప్రజలకు వివరించినట్లు తెలిపారు. అనంతరం ఆయన పెంచికలపాడు గ్రామంలో జరిగే హెల్త్‌మేళాలో పాల్గొని పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ వై. ప్రవీణ్ కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాంజీనాయక్, డీపీఎంయు డాక్టర్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

ప్రతిరోజూ సైకిల్ తొక్కడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు అందుకోవచ్చని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన జొహరాపురం రోడ్డులో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులైన గుండెజబ్బులు, బీపీ, షుగర్, క్యాన్సర్‌ను నివారించుకోవచ్చన్నారు. శారీరక బరువు కూడా తగ్గుతుందని, కండరాల పటుత్వం పెరుగుతుందని, ఒత్తిడిని తగ్గించుకోవచ్చని చెప్పారు. సైక్లింగ్ చేయడం ద్వారా ఏ కారణం చేతనైనా మరణించే ప్రమాదాన్ని 41శాతం, క్యాన్సర్ మరణాలను 45శాతం, గుండెజబ్బుల మరణాలను 46శాతం అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ శివబాలనాగాంజన్ తదితరులు పాల్గొన్నారు.

19న గోదా సమేత రంగనాథస్వామి శోభాయాత్ర

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని మామిదాలపాడు వద్ద ఉన్న గోదాగోకులంలో శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం మార్చి 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు వెల్లడించారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మార్చి 1న దేశంలోని వివిధ సాధుసంతులు, జీయర్ స్వాములు, పీఠాధిపతుల సమక్షంలో ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందన్నారు. విగ్రహ ప్రతిష్ఠకు ముందు ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ నుంచి వివేకానంద సర్కిల్, మౌర్యా ఇన్, ఆర్ఎస్ రోడ్, నగర పాలక సంస్థ కార్యాలయం, ప్రకాష్ నగర్ మీదుగా గోదా గోకులానికి వివిధ కళారూపాలు సాంస్కృతిక కార్యక్రమాలతో శోభాయాత్ర జరుగుతుందన్నారు. ఈ నెల 20న అంకురార్పణ, 21న శ్రీ విశ్వక్సేన ఇష్టి, 22న శ్రీసుదర్శన ఇష్టి, 23న శ్రీహయగ్రీవ ఇష్టి, 24న శ్రీలక్ష్మీనారాయణ ఇష్టి, 25న శ్రీనృసింహ ఇష్టి, 26న శ్రీవైభవేష్టి, 27న శ్రీవైనతేయ ఇష్టి, 28న శ్రీమన్నారాయణ ఇష్టి, జలాధివాసము, ధాన్యాధివాసము, శయ్యాధివాసము తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సమావేశంలో గోదా గోకులం సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, వేముల జనార్ధన్, భూమా కృష్ణమోహన్, పెరుమాళ్ల బాలకృష్ణ, ఇల్లూరు రామయ్య, వేముల రవిప్రకాష్, పెరుమాళ్ల బాల సుధాకర్, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, పాలాది వెంకట సుబ్రహ్మణ్యం, కార్పొరేటర్ విక్రమ సింహారెడ్డి, కటకం అనురాధ, రాచమ మణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. సుభాష్ చంద్రబోస్ ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మన రాష్ట్రంలో మొదటి దళిత ముఖ్య మంత్రిగా పని చేసి ఖ్యాతి గడించారన్నారు. నిరుపేద కుటుంబ నుంచి వచ్చి నీతి, నిజాయితీగా పాలన సాగించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఉప గ్రంథ పాలకులు పెద్దక్క, గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంజీవయ్య ఆశయ సాధనకు కృషి

కర్నూలు(సెంట్రల్): భారతదేశ రాజకీయాల్లో దామోదరం సంజీవయ్యకు విశిష్ట స్థానం కలదని, ఆయన ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు అన్నారు. మంగళవారం సంజీవయ్య 102వ జయంతిని పురస్కరించుకొని కళా వెంకట్రావు భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం ఎదుట ఉన్న సంజీవయ్య విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నలుగురు ప్రధానమంత్రుల కేబినెట్‌లలో మంత్రిగా, రెండు సార్లు ఏఐసీసీ అధ్యక్షుడిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసినా పావలా సంపాదించుకోని నిజాయితీ పరుడు దమోదరం సంజీవయ్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణగుప్తా, బతుకన్న, బజారప్ప, ఖాజహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శివయ్య 'సేవ'కులు

శ్రీశైలం వెళ్లే శివభక్తుల సేవలో పలు సంస్థలు తరిస్తున్నాయి. మహా శివరాత్రిని పురస్కరించుకొని శ్రీగిరికి ఏటా శివ దీక్షపరులతో పాటు పలు ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు పాదయాత్రగా వెళ్తుంటారు. శివ దీక్ష తీసుకున్న స్వాములకు కర్నూలు నగరంలో ప్రతి సంవత్సరం మండలం రోజుల పాటు అన్నదానం చేస్తున్నారు. దాతలు ధన, ధాన్య, వస్తు రూపేణా కానుకలు ఇస్తుండటంతో సేవా కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగుతున్నాయి.

–కర్నూలు కల్చరల్



– ఈ చిత్రంలో ఆహారం వడ్డిస్తున్న వ్యక్తి కర్నూలు కార్పొరేటర్ ఎ.నాగలక్ష్మిరెడ్డి. నగర శివారులోని సాయి మీనాక్షి సుందరేశ్వర ఆలయంలో గత 15 ఏళ్లుగా తన సొంత ఖర్చులతో భక్తులకు అన్నదానం చేస్తున్నారు. రోజుకు 1200 మంది ఆహారం స్వీకరిస్తున్నారు. ఇందుకు రోజుకు రూ.50 వేలుఖర్చు చేస్తుండటం విశేషం. కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులకు అన్నదానం చేయడం తృప్తిగా ఉంటుందన్నారు.



– ఈ చిత్రంలో ఆహారం వడ్డిస్తున్న వారు శ్రీ లలితా కామేశ్వర సేవా సమితి ప్రతినిధులు స్నిగ్ధ, చంద్ర, ఉమేష్, సురేఖ, సురేష్, దుర్గమ్మ, శివమ్మ తదితరులు. వీరు గత కొన్నేళ్లుగా ఆత్మకూరు సమీపంలోని ఇందిరేశ్వరం వద్ద అన్నదానం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్నారు. అక్కిమి ప్రమీలమ్మ ఫౌండేషన్ హనుమంతరెడ్డి, ఫ్రెండ్స్ రూరల్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ శేఖర్, మోహన్, మణి మదీన మహిళా సంక్షేమ సంఘం, ఇగ్నైటింగ్ లైవ్స్ సొసైటీల సహకారంతో కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఈ చిత్రంలో అన్నదాన సేవ చేస్తున్నవారు కుమ్మర వీధి భక్త బృందం. శేషేంద్రనాథ్, మణి కంఠ, నారాయణరెడ్డి, శివపురం నాగరాజు, మునిరంగ బృందం గత ఏడు సంవత్సరాలుగా వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం వద్ద శివ భక్తులకు అన్నదానం చేస్తున్నారు. రోజుకు 1000 మందికి ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నారు. దీనికి ప్రతి రోజు రూ.40 వేలు ఖర్చు అవుతున్నట్లు శేషేంద్రనాథ్ తెలిపారు. వాసవీ మెడికల్ ఏజెన్సీ వారు వైద్య శిబిరం నిర్వహించి సహకరిస్తున్నారన్నారు.



ఈ చిత్రంలో ఉన్నవారు శివదీక్షా పరులు శేఖర్, దాతలు డీఆర్ ఆంజనేయులు, ఆర్య నరసింహులు, యోగిలు. వీరు దాతల సహకారంతో శ్రీశైలంలోని భక్తులకు అన్నదానం చేసేందుకు 13 క్వింటాళ్ల బియ్యం, కూరగాయలు అక్కడికి పంపారు. దాతల సహకారంతో సేకరించిన వస్తువులను భక్తుల సహాయార్థం ఏటా శ్రీశైలం పంపుతున్నట్లు శేఖర్ పేర్కొన్నారు.

16 నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎమ్) ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు బీజేవైఎమ్ జిల్లా అధ్యక్షులు తలారి సుధాకర్ వెల్లడించారు. మంగళవారం మాజీ రాజ్య సభ సభ్యుడు టీజీ వెంకటేష్ ఛాంబర్‌లో టీజీతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షులు రామస్వామి పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తలారి సుధాకర్ మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో పోటీలు జరుగుతాయని, ఆసక్తి గలవారు పోటీల్లో పాల్గొన వచ్చన్నారు. సమావేశంలో బీజేవై ఎమ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ సభలను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 25, 26 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప పిలుపునిచ్చారు. మంగళవారం గోకారి భవన్‌లో మహా సభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంల నాయకులు మనోహర్, సురేస్‌నాయక్, రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు (టౌన్): విద్యార్థులు నిరంతర సాధన, పట్టుదలతో కృషి చేస్తే క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు పొందుతారని రాయలసీమ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.వి. శివకిషోర్ అన్నారు. మంగళవారం స్థానిక సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో అంతర్ విశ్వవిద్యాలయాల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న జట్టును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి కేరళ రాష్ట్రంలోని కొట్టాయంలో ప్రారంభమవుతున్న అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో ప్రతిభ చాటాలన్నారు.